6. అపరిమిత దయా శాంతులు గల ప్రభు - వనిశము కోపింపఁడు నీపై = కృపా వాగ్దత్తము - లెపుడు దలఁచి నీ - యపవిత్రతఁ గని - హా యని యేడ్చుము ॥ఎటిఁగి॥

- పురుషోత్తము చౌదరి

## 320 పశ్చాత్తాప ప్రేరేపణ

రా - బిలహరి (చాయ : భీకరుండౌ) తా-త్రిపుట

యేసు విభునిఁ దలఁచి మదిలో - ద్వేషము లణఁగింపరే = మోస విశ్వ భ్రాంతు లెల్ల - రోసి పరిహర్షింపరే ॥యేసు॥

1. కామ క్రోధ లోభ మోహ - క్షామ గుణములు మానరే = హేమ రీతిని దేవ కృపలో - క్షేమ మున్నది కానరే ॥యేసు॥
2. సత్యవేద సార మెల్ల - నిత్యము రుచిచూడరే = సత్త లేని దురిత జాలి - బొత్తిగా విడ దీయరే ॥యేసు॥
3. కర్త కర్తయనుచు వేఁడి - వ్యర్థులై చెడి పోకరే = స్వార్ధ చర్య లెల్ల మాని - కర్త యేసుని బోలరే ॥యేసు॥
4. బంధు మిత్రు - శత్రు నెనరు - నిందుఁ జూపఁ బూనరే = యందమైన మోక్ష విభవము - లందుఁ గని హర్షింపరే ॥యేసు॥
5. మోక్ష వైభవ మెదలోఁ దలఁచి - మోసమున బడిపోదురే = కక్షి సాతాన్ ముచ్చు వలలను - హెచ్చుగాఁ దెగఁగొట్టరే ॥యేసు॥
6. సద్దులేకను దేవ సేవ - ముద్దుతోఁ గొని యాడరే = హద్దు మీరు విమత సాతాన్ - సుద్దులను ద్యజియింపరే ॥యేసు॥
7. బాధ చేసెడి గురుల వీడుచు - బోధకుల దరిఁ జేరరే = నాధు క్రీస్తును నమ్మి మీరలు - సాధులై వర్తింపరే ॥యేసు॥

-డేవిడ్ లైటన్



## 321 పాపి విలాపము

రా - బిలహరి (చాయ : యేసునాధ కథా సుధా) తా-త్రిపుట

ఆదరింపుము యేసువా ని - న్నాశ్రయించితి నా కికన్ లేదు వేరొక యాశ్రయంబని - లెస్సగా మది నమ్మితిన్ ॥ఆద॥

1. నిరతముండెడు పరమ ధనమను - నీతి జీవిత రీతిలో = పెరుగ గోరుచు నిన్ను జేరితి - ప్రేమ జూపుము యేసువా
2. సత్య సంధుడ లోక బాంధవ - సర్వశాంతి సుధాకర = నిత్యజీవ జలంబు లొసగుము - నీతి నిధుల సజీవుడా ॥ఆద॥
3. ముందు వెనుకను దుష్ట శక్తుల - మూక నన్నరి కట్టగన్ = బంధితుండనైతి నా ప - ద్బాంధవ విడిపించుమా ॥ఆద॥
4. పరమ పురమున కరుగ నేరని - పాలసుడనో రక్షకా = కరుణతో నా మొరను గైకొని - కలుషముల నెడబాపవే ॥ఆద॥
5. పరమ ధాముడ వని యెరిగి నీ - శరణు వేడితి నో ప్రభో = తనువు విడిచిన వేళలో నీ - తలుపు నాకై తెరువు మా ॥ఆద॥

- వి.జి.జాన్ సుందరరావు

## 322 క్రీస్తు మోక్ష మార్గము

రా - ఆనందభైరవి (చాయ : దేవుని ప్రేమ ఇదిగో) తా-కురుజంపె

శరణు నా యేసు ప్రభువా - నీవెగా - పరలోకమునకుఁ ద్రోవ = కరుణతో నన్నుఁ గావ - నీ కన్న గర్త యెవ్వఁడు యేసువా ॥శరణు॥

1. పర సుఖము విడిచినావు - కన్యక - మరియగర్భమున నీవు = ధరణి నుదయించినావు - నీ కన్న - దాత యెవ్వఁడు యేసువా ॥శరణు॥
2. పాపభారము క్రిందను - బడి యున్న - పాపాత్ములను నెల్లను = జేఁపట్టి రక్షింపఁగా - నీ కన్న - శ్రేష్ఠుఁ డెవ్వఁడు యేసువా ॥శరణు॥
3. మరణమై లేచినావు - జీవింప - మార్గంబుఁ జూపినావు = పరమహిమ జూపినావు - నీ కన్నఁ - ప్రభుఁ డెవ్వడు యేసువా ॥శరణు॥

-మిక్కిలి సమూయేలు